


# ఏ సర్టిఫికెట్

లేట్ నైట్ షో అయినా జనం రద్దీ ఎక్కువగానే వుంది ఆ థియేటర్ దగ్గర.

అందుక్కారణం ఫేవరెట్ హీరో, హీరోయిన్ల న్యూ రిలీజ్ కాదు. చిత్రం బ్రహ్మాండంగా వుందనీ కాదు.

సరస-శృంగార రస ప్రధానమైన మళయాళీ చిత్రం కావడమే అది!

'శృంగార రాత్రులు'... 'ఏ' సర్టిఫికెట్ పిక్చర్!

పేరులోనే పలుకుతోంది సెక్సంతా.

శీతాకాలపు చలి రాత్రి... ఆ చిత్రంలో... వెచ్చదనాన్ని కోరుకొనే వారే అంతా!

వాల్ పోస్టర్ల మీద దాదాపు నగ్నంగా కనిపిస్తున్న... కవ్విస్తున్న... హీరోయిన్ అందాల వంపులూ, శరీరపు సొంపులూ... లొట్టలు వేసుకుంటూ... వొళ్ళంతా కళ్ళు చేసుకుని మరీ చూస్తున్నారు జనం.

బోర్డు మీద బొమ్మ చూస్తుంటేనే చలి ఎగిరిపోతున్న భావన... సినిమా చూస్తూంటే వళ్లు ఇంకెంత వేడెక్కిపోతుందోనన్న తపన!

అందాల హీరోయిన్ సుందర పరువాలను ఫ్రీగా, తమ సొంతంలా రెండు కళ్ళతోనూ జుర్రివేసుకోవాలన్న వెర్రి ఆశతో, ఆవేశంతో హాల్లో అడుగు పెడుతున్నారంతా. హౌస్‌ఫుల్ చేసేస్తున్నారు.

జనమంతా థియేటర్‌లో దూరిన కొంత సేపటికి- హంస రథంలా రోడ్డు మీద సర్రున జారుతూ, గాలిలో తేలుతూ అందాల కాంటెస్సా ఒకటి వచ్చి ఆగిందక్కడ.

మరింత అందంగా వున్న ఓ బాల అందులోంచి దిగింది. ఒయ్యారాలను ఒలికిస్తూ, చిరు నవ్వులు చిలికిస్తూ... మానేజర్ గది వైపు నడిచింది, పువ్వుల హ్యాండ్ బ్యాగ్ విలాసంగా ఆడిస్తుకుంటూ.

ఆమెను చూడగానే సగౌరవంగా ఆహ్వానించాడు మానేజర్.

''సినిమా ఎలా పోతోంది?'' చిరునవ్వుతో అడిగిందామె సోఫాలో కూర్చుంటూ.

''రిలీజయింది మొదలు హౌస్‌ఫుల్ కలెక్షన్సే'' జవాబిచ్చాడు మానేజర్. ముఖం మతాబులా వెలిగిపోతూంటే. ఆ సినిమా తాలూకు సెక్సంతా అతని వదనంలానే తళుక్కుమంది.

''గుడ్! పిక్చర్ రిలీజయిన నెల్లాళ్ల నుంచి ఏ రోజుకారోజే రావాలనుకుంటూ రాలేకపోతున్నాను. ఇప్పటికి తీరింది'' అందా భామ. ''బాల్కనీ టికెట్ ఇవ్వండి''.

ఆమె హ్యాండ్ బ్యాగ్‌లోంచి డబ్బులు తీసి ఇస్తూంటే పుచ్చుకోలేదు మానేజర్. తటపటా యింపుగా చూశాడు.

అంతలో హాల్లో బెల్ మ్రోగింది, పిక్చర్ ఆరంభం కాబోతున్నట్టు.

''సినిమా మొదలవుతోంది. టికెట్ త్వరగా తెండి'' అందామె లేచి నిలుచుంటూ.

గుటకలు మింగాడు మానేజర్- ఓ క్షణంపాటు రెప్పవేయకుండా ఆమె వంక పరిశీలనగా చూశాడు.

పదిహేడేళ్ళుంటాయి ఆ లేమకు. వదనంలో పసిదనం కొట్టవచ్చినట్టు కనిపిస్తోంది. మళ్ళీ మళ్ళీ చూడాలనిపించే అందం ఆమెది. సహజ సౌందర్యానికి సౌకుమార్యం జోడైన అపురూప రూపం.

''క్షమించాలి. ఇది అడల్ట్ ఫిల్మ్...'' అన్నాడు మానేజర్ ఇబ్బందిగా.

వింతగా చూసిందామె. ''అయితే-?!'' అంది. ఆమె తీయటి స్వరంలో అంతులేని విస్మయం.

''మా థియేటర్‌లో రూల్స్ స్ట్రిక్టుగా పాటిస్తాం. 'ఏ' సర్టిఫికెట్ ఫిల్మ్‌కి మైనర్స్‌ని అనుమతించం'' అన్నాడు మానేజర్ మందహాసం చేయడానికి ప్రయత్నం చేస్తూ.

అవాక్కయిందామె. పూరేకుల వంటి కన్నులను వెడల్పు చేసుకుని అతనివంక చూసింది. చివరికెలాగో గొంతు పెకల్చుకుంది.

''తమాషా చేస్తున్నారా?'' అని అడిగింది, ఓ స్వీట్ స్మైల్ రంగరించి.

''ఇది తమాషా కాదమ్మా'' అతని గొంతులో ఎంబరాస్‌మెంట్ తొంగి చూసింది.

''నేనెవరో... మీరు... గుర్తించారనుకున్నాను''

---

## మన స్వాతంత్ర్యం మేడిపండు

## మన 'అవినీతి' రాచపుండు

మన స్వాతంత్ర్యం మేడిపండు! మన దరిద్రం రాచపుండు అని ఆరుద్ర అంటే అన్నాడేమోగానీ. మన దరిద్రం బదులు మన 'అవినీతి రాచపుండు' అనుకోవాల్సి వస్తుంది. ఇటీవల సి.బి.ఐ. దాడుల్లో బయట పడిన నిజానిజాలని పరిశీలిస్తే!

సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌వారు గత 'మే'లో దేశంలోని అత్యంత ప్రధాన నగరాలైన ఢిల్లీ, కలకత్తా, బొంబే, మద్రాసు, కొచ్చిన్, బెంగుళూర్, పాట్నా, షిల్లాంగ్, శ్రీనగర్‌లతో సహా మొత్తం పధ్నాలుగు (14) నగరాలలో జరిపిన దాడులలో ప్రభుత్వ రంగ సంస్థల అధికారుల, బేంక్ ఆఫీసర్ల,సైనిక దళాధికారుల అవినీతి కార్యకలాపాలు ప్రముఖంగా బయటికొచ్చాయి.

ధన్‌బాద్‌లోని ఒక అలహాబాద్ బేంక్ మేనేజర్ 353 బినామీ పేర్లతో ఖాతాలు తెరచి దాదాపు ఒక కోటి రూపాయలు కైంకర్యం చేసిన విషయం గత సంవత్సరం సి.బి.ఐ. దాడులలో వెలుగులోకి వచ్చింది. ఆ తరువాత ఆదాయం పన్ను శాఖాధికారులు ఆ బేంక్ మేనేజర్ ఇంటిపై దాడి చేశారు.

ఇటీవలే జైపూర్ నుంచి న్యూఢిల్లీకి బదిలీ అయిన ఒక బ్రిగేడియర్ తన ట్రూప్‌ల కోసం కొనుగోలుచేసిన ఆహార పదార్థాలకి సంబంధించిన టెండర్లలో అధికార దుర్వినియోగానికి పాల్పడినట్టు తెలియవచ్చింది. ఆ బ్రిగేడియర్ వద్ద 400 అమెరికన్ డాలర్లు వున్నట్టు కనుగొన్నారు.

పాట్నాలోని కొంతమంది ప్రభుత్వ రంగ సంస్థల అధికారులు సూపరింటెండింగ్ ఇంజనీర్లతో కలిసి దాదాపు 15 లక్షల యాభై వేల రూపాయలు అక్రమంగా భోంచేశారట.

ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్, హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ జనరల్ మేనేజర్, జబల్‌పూర్‌లోని గన్ కేరేజి ఫేక్టరీ జనరల్ మేనేజర్, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్, రూర్కెలా స్టీల్ ప్లాంట్ డిప్యూటీ చీఫ్ మెటీరియల్ మేనేజర్, ఆయిల్ ఇండియా మాజీ ఫైనాన్స్ మేనేజర్, అసిస్టెంట్ కలెక్టర్ ఆఫ్ కస్టమ్స్ (బొంబే) మొదలగు ఉన్నతాధికారులు ఈ అవినీతి కూపంలో మొలలోతు దిగిపోయినట్టుగా సి.బి.ఐ. అధికారులు చెపుతున్నారు.

ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ (ఉప సంచాలకులు)కి రాజధానీ నగరంలో నరేలా ప్రాంతంలో ఆరు లక్షల రూపాయల విలువ చేసే అద్భుతమైన గృహంతో పాటుగా, మరో రెండు నివేశన స్థలాలు, రెండు కార్లు, రెండు మోటారు సైకిల్లు వున్నాయట!

ఉన్నత వర్గాలలో పేరుకుపోయిన అవినీతిని సమూలంగా నాశనం చేసేందుకు ఇలాంటి దాడులు ఎన్ని జరిపినా, గొంగలిలో భోంచేస్తూ వెంట్రుకలు ఏరిన చందంకాక మరో విధమెలా అవుతుంది.




-తిరుమలశ్రీ

అంది నెమ్మదిగా, తల వంచుకుని.

"మిమ్మల్ని గుర్తించబట్టే... మీ వయసు... తెలిసింది నాకు" అన్నాడతను చిరునవ్వు కోసం ప్రయాసపడుతూ- "అశక్తుణ్ణి! రూల్సు అతిక్రమిస్తే నా ఉద్యోగం వూడుతుందమ్మా"

డిస్ ప్లే బోర్డ్సుపైన పడింది ఆ అలన దృష్టి.

'శృంగార రాత్రులు...'

జెయింట్ సైజ్ 'ఎ' మధ్య అందంగా బందీ అయ్యాయి అక్షరాలు.

అందులో... హీరోయిన్... మాధురి... అర్ధ నగ్నంగా... ఒక్కో ఫ్రేమ్‌లో దాదాపు నగ్నంగా... వివిధ భంగిమలలో... అందమంతా తనలోనే పొందు పరచుకున్నట్టు...అపూర్వమైన సెక్స్ అప్పీలుతో... ఎంతో రమణీయంగా వుంది. కావ్య నాయికలా, ప్రబంధాలలోని శృంగార నాయికలా... చూపరుల మనసులను రంజింపజేసేలా... పురుషులకు వెర్రెక్కించేలా... స్త్రీలను సైతం చిత్తు చేసేలా వుంది. ఆమె వదనంలో, చిరునవ్వులో, అణువణువునా శృంగారం ద్యోతకమవుతోంది.

ఆ బాలను వెక్కిరిస్తోంది మాధురి. కవ్వింపుగా నవ్వుతోంది. సవాలుగా చూపులు విసురుతోంది.

ఎలాగైనా ఆ సినిమా చూడాలని కుతూహలంగా వుంది ఆ యువతికి. కాని, తాను మైనర్ కావడాన మానేజర్ అనుమతించడం లేదు.

ఎంతో నచ్చజెప్పపోయిందామె అతనికి. ఒత్తిడి తేబోయింది. ఆ ఒక్కసారికీ లోపలికి వదలమని ప్రాధేయపడింది. కాని, సవినయంగానే ఆమె కోర్కెను తిరస్కరించాడతను.

ఆట మొదలై అప్పుడే పది నిమిషాలైపోయింది. నిరాశతో నిట్టూర్చి బయటకు నడిచిందామె- మానేజర్ క్షమాపణల మధ్య.

కారు దగ్గరకు నడుస్తూంటే ఆమె స్నేహితురాలు జయ ఎదురుపడింది. స్నేహితురాలిని చూడగానే ఆనందంతో పలుకరించింది జయ.

"హాయ్! సినిమా చూడ్డానికొచ్చావటే?" అని అడిగింది జయ సాశ్చర్యంగా.

"వూ" అందామె గోముగా.

ఆ యువతులిద్దరూ మంచి స్నేహితురాండ్రు. కాకుంటే ఆమె కంటె రెండేళ్ళు పెద్దది.

"మరి తిరిగి వెళ్ళిపోతున్నావేం?" అడిగింది జయ.

"ఇది అడల్ట్ ఫిల్మట! చిల్డ్రన్ చూడకూడదట! మానేజర్ అనుమతించడం లేదు" అందామె నిరుత్సాహంగా.

అమితాశ్చర్యంతో కన్నులు పెద్దవి చేసుకుని చూసింది జయ. "చిత్రంగానే వుంది!" అంది.

చిరునవ్వు నవ్వింది ఆ రమణి.

"మానేజర్ నిన్ను గుర్తు పట్టలేదేమో, పోనీ నువ్వయినా చెప్పలేకపోయావా?" అంది జయ నవ్వుతూ.

"అదేం కాదులే, మానేజర్ నన్ను సరిగానే గుర్తు పట్టాడు. కాని, రూల్స్ వొప్పుకోవట! నన్ను లోపలికి ఎలో చేయడం లేదు" అందామె.

ఆ సమాధానం వినడంతోనే ఫక్కుమంది జయ.

"ఎందుకే ఆ నవ్వు?" అందామె చికాకుగా. అసలే లోపలికి వెళ్ళనివ్వలేదన్న వుక్రోషం. అందుకే స్నేహితురాలి నవ్వు దెప్పుడులా తోచింది ఆమెకు.

"అబ్బే, ఆ సినిమా చిల్డ్రన్ చూడకూడదంటే వొప్పుకుంటాను. కాని, నువ్వు చూడకూడదంటేనూ... నవ్వొచ్చింది!" అంది జయ.

"సమయానికి అవుట్ డోర్ షూటింగ్‌లో వుండడం వల్ల, పిక్చర్ రషెస్ చూడలేకపోయానే జయా! థియేటర్లో చూడొచ్చులే అనుకుంటే- హు, ఇదీ అనుభవం!..." అందా లేమ నీరుకారిన ఉత్సాహంతో నీరసంగా. "సరేలే... నేను వెడుతున్నాను. నువ్వయినా చూసి రా" అంటూ కారు వైపు నడిచింది.

నిశ్చేష్టురాలయిన జయ అలాగే చూస్తూ వుండిపోయింది. విసురుగా వెడుతున్న స్నేహితురాలు, 'శృంగార రాత్రులు' హీరోయినూ అయిన మాధురి వంక!!

---



## ప్రవాసాంధ్రులు



స్వగ్రామం అన్నవరంలో టెన్త్ వరకు చదివి, తదుపరి రాజమండ్రి శ్రీ గౌతమీ విద్యాపీఠంలో ఐదేళ్ళు చదివి 'సాహిత్య విద్యాప్రవీణ'లో ఉత్తీర్ణుడనయ్యాను. ఆ పిమ్మట తిరుపతిలోని కేంద్రీయ సంస్కృత విద్యాపీఠంలో పది నెలలు శిక్షణ పొంది స్వగ్రామం చేరాను. అక్కడ ఒక సంవత్సరం వృథాగా గడిపాక సొంతంగా కాన్వెంట్ ఒకదానిని ప్రారంభించాను. ఒక పక్క కాన్వెంట్ రోజు రోజుకీ తీరుతెన్నూ దిద్దుకుంటుండగా, మరోపక్క 'రైల్వే సర్వీస్ కమిషన్' కలకత్తా నుంచి టీచర్ పోస్టుకి అపాయింట్‌మెంట్ వచ్చింది. ఏడాదిన్నర క్రితం వెళ్ళిన ఇంటర్వ్యూ ఫలితమిది. ఖుర్దారోడ్ పోస్ట్ చేశారు. 'అంత దూరమా' అనిపించినా ధైర్యం చేసి వచ్చి చేరాను. ఖుర్దారోడ్‌కి వచ్చి ఎనిమిదేళ్ళు. అంతా బాగానేవుంది. విశాఖపట్టణానికి 424 కిలోమీటర్ల దూరంలో వుంది ఈ ప్రదేశం. పూరీ వెళ్ళేందుకు ఇది జంక్షన్. ఇక్కడకు పూరీ క్షేత్రం 44 కిలోమీటర్లు. భువనేశ్వర్ 19 కిలోమీటర్ల దూరంలో వున్నాయి. శిల్ప సంపదకు గనియైన కోణార్కకు పూరీ నుంచి గానీ భువనేశ్వర్ నుంచి గానీ వెళ్ళవచ్చు. భువనేశ్వర్‌కు చాలా దగ్గరలో జైన గుహలు ఉదయగిరి, ఖండగిరి, బౌద్ధారామమైన ధవళగిరి కలవు. ఖండగిరిలో ఖారవేలుని శిలాశాసనం వుంది. 37 కిలోమీటర్ల దూరంలో బరాంగ్‌లో సహజ సిద్ధమైన జంతు ప్రదర్శన శాల, బొటానికల్ గార్డెన్స్ వున్నాయి. ఖుర్దా రోడ్ జనాభాలో 40 నుంచి 50 శాతం వరకు తెలుగువారే. 'ఫలానా ఉద్యోగమే చేస్తాను' అనుకోకుండా అర్హతలకు అంది వచ్చే ఏ చిన్న ఉద్యోగమైనా చెయ్యదలచినవారికి తప్పక 'రైల్వేస్'లో ఉద్యోగం దొరకుతుంది. నిరుద్యోగ సోదరులు ఏ ప్రాంతం, ఏ రాష్ట్రం అని చూడక వచ్చిన చోట ఉపాధి దొరికినప్పుడు వచ్చిన చోట చేరి ఉద్యోగులు కావాలి.

—చామర్తి గణపతి ప్రసాద్

చిరునామా:
**Ch. GANAPATHI PRASAD,**
**Teacher,**
**SC Rly. M.P.School,**
**KHURDAROAD**
**PURI DISTRICT**
**ORISSA**
**Pin: 752 050**